

# షడైతే మమ బాంధవాః

గురువు పురుషోత్తం పాఠం చెపుతున్నాడు. శిష్యురాలు సుమతి పుస్తకం చూస్తున్నది. పుస్తకం చిన్నది. పేరు నీతి శాస్త్రం. సంస్కృతం నేర్పుతాడు పురుషోత్తం. వారాలబ్బాయి. వేద పాఠశాలలో విద్యార్థి. ఒక గదిలో అయిదు లేక ఆర్గురు విద్యార్థులుంటారు. పాఠశాలలో లాడ్జింగే లభిస్తుంది. బోర్డింగ్ వారే చూసుకోవాలి. వారే వండుకున్నా మంచిదే. చాలా మంది విద్యార్థులు వారాలు చేసుకుంటూనే పరీక్షలకు హాజరవుతున్నారు.

సుమతి తల్లి అన్నపూర్ణమ్మ, వూరికేనే యెందుకు వారాలివ్వాలని, వారానికి మూడు రోజులు రెండు పూటలా భోజనం పెట్టాలని సుమతికి సంస్కృతం నేర్పమన్నది.

''అలాగే'' అని ప్రారంభించాడు పురుషోత్తం. భోజనానికి పిలుపు వచ్చే దాకా చెప్పాలి. ఒక్కోసారి శ్రద్ధగా చెపుతుండగానే పదినిమిషాలకే పిలుపు వస్తుంది.

పద విభజన, అర్థాలు, శబ్దాలు, విభక్తులూ, దండాన్యాయం వచ్చేసినై సుమతికి. కుశాగ్రబుద్ధి సుమతిది.

'' ఏతే షత్ యీ ఆరుగురూ, మమబాంధవాః నాబంధువులూ'' అని ముగించి తలెత్తి చూస్తే శిష్యురాలు నవ్వుతున్నది.

''అంత నవ్వెందుకొస్తుందీ?'' అన్నాడు గురువు.

''రాదా మరి! ఆకలికి వూహకందలేదేమో! యేదో కవిత్వం అల్లాడు. అందులో నిజమున్నదా? కల్పించాడేమో?'' అన్నది సుమతి.

''యేది నిజం?'' కుతూహలంతో చూశాడు పురుషోత్తం. ''తిట్టి మొట్టి, బుగ్గలు గిల్లి, పనిచేయించి, ''నీ మొహానికి మొగుడొస్తాడుటే? నీ అవతారం నువ్వూ! రంభవు కాదు, కట్నం కుమ్మరించలేదు తండ్రి'' అలా దండకం వల్లిస్తూ

నిజం చెప్పేది తల్లి. 'సుమతీ! అదెవరూ? దాంతో తిరుగుతున్నావేం? అది దూరే ప్రతీ యింట్లోకి నువ్వూ దూరుతున్నావే? దాని కెటువంటి పేరొచ్చిందో తెలుసా? అంత పిన్నవయసులోనే దళారితనం చేస్తున్నది. నీతీ నియమం వరసావావీ పెద్దా చిన్నా పాటించని వాళ్లతో చెలిమి చేసి తిరిగావంటే, తాట వూడదీస్తా. నాకు చెడ్డపేరు తెచ్చేట్టున్నావే అప్రాచ్యురాలా!'' అలా అంకెలు వేస్తూ జ్ఞానం కలిగించేవాడు తండ్రి. 'సుమతీ! అత్తయ్య కూతురు సుశీలకి మంచిగుడ్డలు లేవుట. అన్నీ చిరుగులు పడిన పాతవేనట. బడికెళ్లనంటున్నది. సుశీలను నా కివ్వ నిశ్చయించారు అత్తయ్యా మామయ్య. నీకున్న వాటిలో మంచివి యేరి రెండు జతల దుస్తులియ్యి సుశీలకి. నీ యీడుదే. అంతే యెత్తు. సుశీల చిక్కిపోతున్నది. నువ్వు మేసే చిరుతిండిలో దానికి భాగం పెట్టు రోజూ. అత్తయ్య దానికి మంచి పోషణ చేయటం లేదు. చాకిరీ చేయిస్తున్నది. అదే మొదటి సంతానమట. అందుకని చేయాలిట. వంటింట్లో సాయం గాక, పై పనిగాక, కిరాణా తెచ్చి లెఖ్ఖ చూపాలిట. చదువు కోను టైమేదీ దానికీ? సుశీలకి బొత్తిగా లెక్కలు అర్థం గావటం లేదుట. నువ్వు నేర్పు. హోమ్ వర్క్ చేసిపెట్టు. నీకు లెక్కల్లో ఫస్ట్ మార్క్ అని చెప్పింది సుశీల. మీ టీచరు మెచ్చి పెన్ను ప్రెజెంట్ చేసిందట నీకు'' అలాటి ధర్మం తెలియజెప్పేవాడు భ్రాత.

''మంచి మంచివన్నీ నేర్పుగా యెత్తుకుపోతూ, అసూయతో కుములుతూ దెప్పుతూ, ''నీకేమమ్మా తల్లి వండి వడ్డిస్తుంది. పుస్తకాలు కట్టలు మాసినా చిరిగినా కొత్తవి వేసిచ్చే మేనబావ వున్నాడు. బడినించి ఒంటరిగా వస్తావని యెదురుగా వచ్చి తోడు వస్తాడు. మంచి పెన్ను పెన్సిళ్లూ కొనిచ్చే పెత్తల్లులున్నారు. టెక్ట్స్ బుక్స్ రాగానే కొని తెచ్చిచ్చి అందించే పిన్నత్త వున్నది. వీధిన బడి తిరిగి జనం మధ్య దూరి కొనుక్కోనక్కర్లేదు. కొత్త బాటా చెప్పులు కొనిబెట్టే తాతగారున్నారు. దోవలో కనబడగానే స్కూటరు మీదెక్కించి తెచ్చి దింపిపోయే మామ కొడుకున్నాడు. నా మొహానేమున్నదీ? అన్నీ నేనే చేసుకోవాలి. చెప్పుల్లేకుండా యెర్రనెండలో బడికి రావాలి. గొడుగేదీ నా మొహాన. వాన వస్తే

తడుస్తూ యింటికెళ్లాలి'' అని నసబెట్టేది సఖి'' అని ఆపింది సుమతి.

''మరి తక్కిన రెండూ యెలా పూరిస్తావో తెలుసుకోవాలని వున్నది సుమతీ'' అన్నాడు పురుషోత్తం. ''భలే విద్యార్థి'' అనుకున్నాడు మనసులో.

''అవేమంత గడ్డు సమస్యలా పూరించలేక పోవటానికి గురువుగారూ! మా బావ తమ్ముడున్నాడు. నలకూబరుడంత అందగాడు. వయస్సూ తక్కువే. పాతికేళ్లు. వుద్యోగమూ గొప్పదే. డెప్యూటీ లేదా అసిస్టెంట్ కలెక్టర్. గొప్పింటి పిల్లనిచ్చారు. అత్తింటి కొస్తూనే వుద్యోగరీత్యా వేరింటి కాపరం వెలిగించే అదృష్టవంతురాలు. బావ సురేష్‌ను పేరుపెట్టి పిలుస్తుంది''.

'సూరీ! అదెవత్తె? దాన్ని వెంటేసుకు తిరుగుతున్నావే ప్రభుత్వ వాహనంలో? వుండు నీ సంగతి అత్తయ్య తోనూ మామయ్యతోనూ చెపుతా. అత్తయ్య ఆంజనేయ దండకం అందుకుంటుంది. మామయ్య కర్ర తిరగేస్తాడు. ఇవాళ మరీ పొద్దుబోయి వచ్చావేం? కుమారి అనే స్టెనోతో సరసాలాడుతుంటే టైమ్ గుర్తు రాలేదా? దానికి ప్రెగ్నెన్సీ వచ్చిందంటే నీ పని దివాలా. సెక్సువల్ హరాస్‌మెంట్ కేసులో నిన్నిరికించి వినోదించి అంతా లాగేయగల జాణ అది. వేలెడు జాకట్టు, జానెడు చీరకట్టి హైహీల్సు టకటకలాడిస్తూ నీ మతి పోగొట్టిందే! అంతా ముద్ర శుద్ధిగా మామయ్య చేతులో పొయ్యి, లేదా నా చేతికివ్వు. నాక్కావల్సినవన్నీ మా వాళ్లు కొనాలా? నిన్ను సెలెక్టు చేసిన దెందుకూ? యెక్కడ దొరికావోగాని మా నాన్నకి మరెవరూ అందలేదా అడగాలి'' అలా ఛిద్రం లేవదీసి బెడ్‌రూమ్‌లో దూరి, తలకు వాసిన కట్టి, అలిగి మూడంకె వేసి, అన్నానికి రాననేదీ పత్ని. మా బావ పెళ్లాం పేరే సత్యభామ. బాగా పెట్టారు. సురేష్ వెళ్లి తన్నులు తిని బతిమాలి బామాలి మోసుకొచ్చి కూచోబెట్టి అన్నం తినిపిస్తాడు. పేచీలు పెడుతుంది. తల్లీ కొడుకుల మధ్యతంపీలు పెడతుంది. సత్యభామ తండ్రి భీమా కంపెనీ యేజెంటు. సెకెండ్ హాండ్ కారు కొనిచ్చాడు సత్యభామకి. సత్రాజిత్తు శమంతకమణి యిచ్చినట్టు. లోన్ తెప్పించి మట్టసంగా

యిల్లు కట్టించి సత్యభామ పేర పెట్టాడు. అందుకే అంత శాంతి ఆ పత్ని వల్ల''. సుమతి నవ్వుతుంటే ఆ పిల్ల వంకే చూస్తూ పురుషోత్తం అన్నాడు. చివరది గూడా పూరించాలి. భోజనానికి పిలుపు వచ్చేసింది. సస్పెన్సు బాగుండదు''.

''వినలేరేమో''

''వింటా వింటా. శాస్త్రం శ్లేష వేసి చెపుతున్నావు''.

బాగా ప్రోత్సాహం లభించింది సుమతికి.

''మా తాతగారికి ఆరుగురు కొడుకులు, యిద్దరు కూతుళ్లూ. నూరెకరాల మాగాణి. పెద్ద భవంతి. ఊరి పెద్ద. భార్య వెంకమ్మ పనిమంతురాలు. నా చిన్నతనంలో నన్ను ఒళ్లో కూచోబెట్టుకుని తల మీద రాస్తూ ముద్దు చేస్తూ చెప్పేవాడు తాత. అంతా గుర్తు లేదు. కొంత భాగం అర్థం గూడా కాలేదు''.

''బుల్లెమ్మా యిలాంటి సుపుత్రుడు కలుగుతాడనుకోలేదు. ఒక కన్ను మెల్ల సుపుత్రునికి. మెల్ల కన్ను భాగ్యశాలి ఔతాడన్నారు. కాని నూరెకరాలలో నలభై యెకరాలు యెవరినీ సంప్రదించకుండా అమ్మేశాడు. వుద్యమమనీ, పిల్లల పెళ్లిళ్లనీ, కార్యకరామతులనీ ఖర్చు చేసేశాడు. తండ్రికి మతి చలించిందనీ, వయసు వుడిగి కూడా పొలంలో కూలీ అమ్మాయిలతో తిరుగుతూ స్వంత వ్యవసాయం వెలిగిస్తున్నట్టు భ్రమ కల్పిస్తూ చాటుగా డబ్బందిస్తున్నాడు మా నాన్న. వూరు మాటుమణిగాక, చుక్క వేసుకుని వారికి పోసి ఖుషీ చేస్తున్నాడు'' అని ప్రచారం చేశాడు. అంతటితో వూరుకోక, యీ యిల్లు యిక్ష్వాకుల నాటిది, పడిపోతున్నది. రిపేర్లడుగుతున్నది. అందరికీ పెళ్లిళ్లయి సంతు పెరిగింది. యిల్లు చాలదు. నాకే తక్కువ. తక్కిన వాళ్లకే యెక్కువ. ఒక్కచేతి మీదిగా వ్యవసాయం చేసి, ఫలసాయం అందరికీ పంచాలా'' అని తిట్టి ఊరి పెద్దలను, కరణం, మునసబులను తెచ్చి భాగాలు పంచేశాడు. ఆడబిడ్డలకి పెళ్లినాడు పసుపుకుంకుమ కింద యిచ్చిన భూమి స్వాధీనం చేయమని పట్టుబట్టి మర్యాద నిలుపుకున్నాడు తాతయ్య''.

''దేశదిమ్మరిలాగా తిరుగుతూ, గడ్డాలూ మీసాలూ పెంచి, రుద్రాక్షలు ధరించి, దేశభక్తి వుద్యమం నడుపుతున్నట్టు మరియు గురువు వేషం వేసి మఠం నడిపాడు సుపుత్రుడు. మఠంలో డిస్కోర్సెస్, వుపన్యాసాలు చర్చలు వగైరా జోరుగా జరిగేవి. హఠాత్తుగా అరెస్టయినాడు. మఠంలో వెండిబంగారాలు దొరకటమే గాక పన్నుయెగవేత, ప్రామిసరీ నోట్లు, స్టీలు సామాను దొరికినై''.

తాతయ్యకింకా వయసు చెల్లినా లేచి తిరుగుతూ, కాయకష్టం చేస్తూ చదువు చెపుతూ సుపుత్రుడుండగానే, ''పిచ్చి పన్లు చేయకు సుపుత్రా. భూమిని నమ్ముకుందాం. ధర్మాన్ని నమ్ముదాం'' అన్నాడు నవ్వుతూ. సుపుత్రుడూ నవ్వాడు. ''బైటబడినవి నావి కాదు. వుద్యమానికిచ్చిన విరాళాలు. నన్ను వదిలేశారు'' అన్నాడు.

తాతయ్య నమ్మలేదు. భాగం పెట్టాడేమో అని నవ్వుకున్నాడు.

''మరోసారి సుపుత్రుడు డ్రగ్ రవాణా కేసులో యిరుక్కున్నాడు. మందు పాతరలు పెట్టే పిడబ్ల్యుజి వారికి సాయం చేస్తున్నాడని పట్టుకున్నారు. రెండు కళ్లా లొట్ట పోయినైట. సుపుత్రుని పెద్ద కొడుకు పండిత పుత్రుడు. వుద్యోగాలిప్పిస్తానని, పన్లు నెరవేరుస్తాననీ పదువులలో వున్న వారికి తాను క్రియపాత్రుడననీ నమ్మించి డబ్బు చేసుకున్నాడు. కాని అంతా బైటపడి పట్టుబడబోతుండగా పరారీ అయినాడు. సుపుత్రుని మరో తమ్మునికి సంతు కలగలేదు. తిలలూ నీళ్లూ వదిలే వాడుండాలని, పున్నామ నరకానికి పోతాడనీ వైతరణిలో పడతాడనీ పిచ్చెత్తించి, గడబిడ చేసి తన రెండో కొడుకును ఆ తమ్మునికి దత్తు చేయించి, తమ్ముడు కాపాడుకున్న భూమి తన కొడుకు పేర రిజిష్టర్ చేయించాడు. తానే సంబంధం నిశ్చయించి తమ్ముడి చేతే పెళ్లి జరిగేట్టు చేశాడు. లేకపోతే తమ్ముడి భార్యవేపు కాంతమ్మ అనే అమ్మాయి వారి నాశ్రయించుకుని వున్నది. దానికి ధఖలు పడచ్చు. రెండో కొడుకు బైరాగి. వ్యాపారం లోతులు తెలుసుకోకుండా మినీ సూపర్ బజార్ అని పొలం మీద

డబ్బు అప్పుతెచ్చి స్టార్ట్ చేశాడు. మూడవ కొడుకు ఫిల్మ్ యిండస్ట్రీలో యేజెంటుగా మారి తండ్రి కందలేదు. కూతుళ్లను నాలుగు, ఆరో పెళ్లి వాళ్లకిచ్చాడు గదూ. వారిద్దరెక్కడో భర్తలనే నమ్ముకుని వుండి రాలేదు''.

''రెండవ అప్ప సుబ్బమ్మ విడో అయిందని వార్త అందితే పరుగెత్తుకెళ్లి అంత్యకర్మలు శాస్త్రీయంగా చేసి, అప్పకు గుండు కొట్టించి, పుట్టింటి దీపం చూపిస్తారా అని తెచ్చి తండ్రి వద్ద వదిలి వెళ్లిపోయాడు''.

''ఇట్లా అయిపోయినావేం వెంకయ్యా? ఈ వూళ్లో భూములన్నీ నీవే. పెద్ద పెంకుటిల్లు నీదే ఆరునిట్టాళ్లు. చాప చిరిగినా చదరంత మిగులుతుందని శాస్త్రం. నీ పేరేమీ లేదా? లేవలేని స్థితిలో గూడా, బొమికల పోగై, యెండి వరుగై గూడా చిన్నపిల్లలకి వీధి బడీ, పెద్ద బిడ్డలకి సంస్కృత బడీ రన్ చేస్తున్నావే'' అన్నాడు, శతవృద్ధు శంకరయ్య.

వెంకయ్య నవ్వాడు ''సుపుత్రా కొంప పీకరా'' అన్నట్లు చేశాడు సుపుత్రుడు. నా కూతురిక్కడే వున్నది. దాని ద్వారా విను. నే చెప్పలేను''. ఒక్కో సంతానం దగ్గర ఆరేసి నెలలుండమని ఆదేశించి వెళ్లాడు. లోపలినించి కూతురొచ్చి అన్నది ''నాకిచ్చిన పొలం నీదే నాన్నా బాధపడకంటే వినడు నాన్న. పట్నంలో నా మరిది వున్నాడు పోదామంటేరాడు. అక్కడ వృద్ధుల కోసం విడిగా పెద్ద భవనం కట్టి విశ్రాంతి గృహమని నడుపుతున్నారని చెప్పానుపెదనాన్నా. యెవరి వద్దా వుండక్కర్లేదని చెప్పాను. డిస్కోర్సెస్ వినొచ్చు, ఆధ్యాత్మిక పీఠమున్నది చర్చలు జరపవచ్చు. మా నాన్న బాగా చదువుకున్నాడు ఘనాపాటి అని గండపెండేరం తొడిగిస్తామంటే వద్దని తిరస్కరించాడు నాన్న. అష్టపదులు, తరంగాలు, ఆధ్యాత్మిక రామాయణం, కృష్ణకర్ణామృతం వంటివి వచ్చు నాన్నకు, పాడి తోటి వృద్ధులకు మనశ్శాంతి కల్పిద్దురుగాని అని అన్నారు, స్థాపించినవారు. నువ్వు నచ్చచెప్పి సాయం పట్టాలి పెదనాన్నా. ఈ యిల్లు మా నాన్న రైతుది. ఇక్కడే ఆశ్రమం నడుపుతానని నా పెద్ద తమ్ముడు సుపుత్రుడు పథకం వేశాడు.

క్షమా పుత్రః అన్నట్టు నాన్నే క్షమ కలిగి కొడుకుని ''నాయనా యిక్కడీ వూళ్లో యింతవరకు యెవరూ పోలీసుల నాహ్వానించ లేదు. ఓ వేళ పోలీసు రెయిడ్ చేసినా చిప్పలు దొప్పలు దొరుకుతాయి. రుద్రాక్షలు కాలిగుడ్డలూ నిన్ను దాచలేవు. సొమ్ము నా అనుయాయులదనలేవు. ఇక్కడ నీకు అనుయాయులు లేరు. వుద్యమమూ నిన్ను కాపాడలేదు మరిచావేమో. నిన్ను నీవు నడుపుకో. ఈ దేహమే ఆశ్రమం. తొంభై యెనిమిదేళ్లలో నేను తెలుసుకొన్నదిదే. పుత్రా! నన్ను క్షమించి నామానాన నన్ను వదిలేయి. నేను నీకు పనికిరాను'' అన్నాడుట తాతయ్య. చూశారా గురువుగారూ పుత్రుడు తండ్రిని కాపాడటానికెలా ప్రత్యక్షమయేవాడో! మా అమ్మ వడ్డించేసింది'' అని పుస్తకం వదిలి పారిపోయింది సుమతి పక్కింటికి.

గురువు పుస్తకం వేపు చూశాడు.

సత్యం మాతా పితా జ్ఞానం ధర్మోభ్రాత దయాసఖా ।

శాంతిః పత్నీ క్షమా పుత్రః షడైతే మమ బాంధవాః ॥

అని చదివి పుస్తకం మూసి లేచాడు. ''భలే శిష్యురాలు! చాలా సంపాయించిందే లోకజ్ఞానం'' అనుకున్నాడు.